క్లుప్తంగా

తాగునీటి సమస్య పరిష్కారం



తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న సారెడ్డి చంద్రశేఖరరెడ్డి

లింగాల : ఎన్నో ఏళ్లుగా లింగాల ప్రజలు తాగునీటి సమస్యతో సతమతమవుతున్నారు. ఎట్టకేలకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చొరవతో తాగునీటి సమస్య పరిష్కారమైంది. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మే మాసంలో లింగాల గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు తాగునీటి సమస్యను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన స్పందించి పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో చర్చించి రూ.24 లక్షలు పాడా నిధులు విడుదల చేయించారు. ఈ నిధులతో వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ కన్వీనర్ సారెడ్డి చంద్రశేఖరరెడ్డి రెండు బోరుబావులు తవ్వించి మోటార్లు అమర్చి భూ ఉపరితల జలశయాలకు ప్రత్యేక పైపులైన్ అమర్చారు. దీంతో తాగునీరు పుష్కలంగా దిగువ లింగాల గ్రామ ప్రజలకు అందుతున్నాయి. సోమవారం సారెడ్డి చంద్రశేఖరరెడ్డి తాగునీటి పథకాన్ని గ్రామ నాయకులు, ప్రజలతో కలిసి ప్రారంభించారు.

చదువుతోపాటు క్రీడలు ముఖ్యమే



కబడ్డీ అడుతున్న విద్యార్థులు, కరస్పాండెంట్

జమ్మలమడుగు : విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని ఎంఈఓ క్రిష్టఫర్ పేర్కొన్నారు. సోమవారం అంతర్జాతీయ యోగ దినోత్సవంతోపాటు శ్రీనివాస డిగ్రీ కాలేజీ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా పట్టణంలోని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల, జూనియర్ కాలేజీ విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడాలు మానసిక ఉల్లాసంతోపాటు శారీరక ధారుఢ్యాన్ని పెంచుతాయన్నారు. అనంతరం విద్యార్థులకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, క్విజ్, త్రోబాల్ స్కిప్పింగ్ ఇతర క్రీడలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ తాతిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి, వివేకానంద జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

చెన్నూరు : చెన్నూరుకు ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి మంగళవారం రానున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు ముదిరెడ్డి సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సిమెంటు రోడ్డు నిర్మాణంలో భాగంగా భూమి పూజ కార్యక్రమానికి ఆయన హాజరు కానున్నట్లు తెలిపారు. చెన్నూరు కొత్త రోడ్డు వద్ద నుంచి సాంబయ్య ఇంటి వరకు 40 లక్షల రూపాయలతో సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

స్పందన అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యత

వల్లూరు : గ్రామ సచివాలయ స్థాయిలో క్రమం తప్పకుండా స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించాలని మండల స్పెషలాఫీసర్ రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన వల్లూరులోని గ్రామ సచివాలయంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక స్పందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జుబేద, తహసీల్దార్ శంకర్ రావు, ఎంఈవో లిల్లెమ్మ, ఈవోపీఆర్డీ ప్రసాద్ పాల్గొన్నారు.

శ్మశాన స్థలం ఆక్రమణకు యత్నం

కమలాపురం: మండలంలోని టి.చదిపిరాళ్ల పంచాయతీలోని రామచంద్రాపురం గ్రామస్తుల శ్మశాన స్థలాన్ని జంగంపల్లెకు చెందిన ఓ వ్యక్తి దౌర్జన్యంగా ఆక్రమిస్తున్నాడని నివాసితులు మధు, వెంకటేష్, చంద్ర, వెంకట రెడ్డి, నారాయణ, శివారెడ్డి తదితరులు తెలిపారు. సోమవారం వారు విలేకరుల ఎదుట తమ ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామానికి సమీపాన ఉన్న ఊట కాలువ, అటవీ శాఖ స్థలానికి మధ్యలో ఉన్న సుమారు మూడెకరాల ప్రభుత్వ బంజరు స్థలాన్ని తమ పూర్వీకులు 70 ఏళ్లుగా శ్మశానానికి వాడుకుంటున్నారన్నారు. ఇంత ఎవరూ అభ్యంతరం చెప్పలేదన్నారు. అయితే ఇటీవల జంగంపల్లెకు చెందిన వ్యక్తి.. తమ పక్కన కొంత భూమి కొనుగోలు చేసి శ్మశానాన్ని సైతం దౌర్జన్యంగా ఆక్రమించుకుంటున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు.

జూదరుల అరెస్ట్

సింహాద్రిపురం : సింహాద్రిపురంలోని ఉత్తరం వైపున పాతపల్లెకు వెళ్లే మట్టి రోడ్డు పక్కన కంపచెట్లలో జూదమాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రోషన్ తెలిపారు. వారి నుంచి రూ.40,260 నగదుతోపాటు పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

అన్ని వర్గాలకు మేలు జరిగేలా పాలన

- ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ అన్ని వర్గాలకు మేలు జరిగేలా పాలనను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదే అని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గంగిరెడ్డిపల్లె, మిట్టపల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ప్రతి ఇంటికి ఎమ్మెల్యే వెళ్లి.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు అందిన లబ్ధి గురించి తెలియజేయడంతోపాటు వారి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. నూతన రేషన్ కార్డులు, నూతన బిల్డింగులు, తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మంజూరయిన బిల్డింగులకు బిల్లులు రాలేదని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి అందిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ వారిని లక్షాధికారులను చేయాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన లక్ష్యమని తెలిపారు. సంక్షేమ పాలన అందించడంలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం పాలనలో కేవలం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు మాత్రమే పథకాలు అందేవని, అవి కూడా కేవలం జన్మభూమి కమిటీ సభ్యులు సూచించిన వారికి మాత్రమే అందేవన్నారు. ప్రస్తుతం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతోందని తెలియజేశారు. ప్రభుత్వంపై అసత్య ప్రచారాలను చేస్తున్న టీడీపీ నాయకుల మాటలను తిప్పి కొట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, స్థానిక నాయకులు కిషోర్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, చైతన్యకుమార్‌రెడ్డి, ప్రతాప్ యాదవ్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ రమేష్‌తోపాటు మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితం



విద్యార్థికి నగదుతోపాటు ప్రశంసా పత్రం అందిస్తున్న మండల ఇన్‌చార్జి, జెడ్పీటీసీ, ఎంపీపీ

వేముల : విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని వైఎస్సార్‌సీపీ మం డల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ వెంకట బయపురెడ్డి, ఎంపీపీ గంగాదేవిలు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించి జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైన విద్యార్థులకు నగదు బహుమతులతోపాటు మెడల్, ప్రశంసా పత్రాలను అందజేశారు. జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైన విజయేందర్‌రెడ్డి, చందు నిష్విత, హర్షితలకు ప్రభుత్వం అందించిన రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.1000లు నగదు బహుమతులతోపాటు ప్రశంసాపత్రం, మెడల్స్‌ను అందజేశారు. అలాగే వికలాంగ సేవకుడు జనార్ధన్‌రెడ్డి పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులకు రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేల నగదు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సమష్టిగా పని చేయండి

మండల వ్యాప్తంగా గ్రామాల్లో ప్రజా సమస్యలపై అధికారులు సమష్టిగా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందితో జగనన్న సురక్ష కార్యక్రమంపై నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 23న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అర్జునరావు, ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంటల సాగులో దిగుబడులు పెంచుకోవాలి

ప్రభుత్వం వాటర్ షెడ్ పథకం ద్వారా సబ్సిడీతో అందిస్తున్న పైపులను సద్వినియోగం చేసుకుని పంటల సాగులో దిగుబడులను పెంచుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ వెంకట బయపురెడ్డి పేర్కొన్నారు. వాటర్ షెడ్ కింద పథకం మంజూరైన పైపులను పెర్నపాడు గ్రామంలో రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాటర్ షెడ్ పరిధిలోని నల్లచెరువుపల్లె, పెండ్లూరు, కొండ్రెడ్డిపల్లె, నారేపల్లె, పెర్నపాడు గ్రామాల్లోని 216 మంది రైతులకు 3864 రెండున్నర ఇంచు, మూడు ఇంచుల పైపులను 80 శాతం సబ్సిడీతో రైతులకు ప్రభుత్వం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో వాటర్ షెడ్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, టెక్నికల్ అధికారి వెంకట చలపతి, రైతులు చంద్ర ఓబుళరెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్జీ నమోదు కాగానే సమస్య పరిష్కారం



రిటైర్డు డీఎస్పీ ఖలీల్ సొదాగర్

పులివెందుల రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డు డీఎస్పీ ఖలీల్ సొదాగర్ పేర్కొన్నారు. సోమవారం పులివెందులలోని తన గెస్ట్‌హౌస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూసీఐఎల్ కర్మాగారం బయట ఉన్నా.. పేలుడు పదార్థాలను లోపలికి తీసుకొచ్చేందుకు మూడు వాహనాల అనుమతి కోసం జిల్లా కలెక్టర్‌కు చెప్పడం జరిగిందన్నారు. దీనికి ఆయన స్పందించి సంబంధిత అధికారులు ఆర్డీఓ, పోలీసు, అగ్నిమాపక, మోటార్ వెహికల్ అధికారులు, ఎంపీడీఓలు విచారించి అనుమతి ఇవ్వాలని చెప్పడం జరిగిందన్నారు. కానీ అధికారులు స్పందించకపోవడంతో నాలుగు రోజుల క్రితం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో చెప్పడంతో సంబంధిత అధికారులు స్పందించి ఒక్కరోజులోనే వాహనాలకు అనుమతి ఇచ్చారన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రజలలోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గత కొన్ని నెలలుగా పరిష్కారం కానీ సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్నకు చెబుదాంలో అర్జీ నమోదు చేయగానే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించడం జరిగిందన్నారు. కేవలం ఒక్క రోజులోనే సమస్యలను పరిష్కరించే విధంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎస్ఎంఎస్ కంపెనీ తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. అలాగే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని సామాన్య ప్రజలలోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులు, ప్రజా ప్రతినిధులపై ఉందన్నారు.

పుష్పగిరిలో ఘనంగా యోగా



యోగా చేస్తున్న ప్రముఖులు

వల్లూరు: ఈ నెల 21 వ తేదీన జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పంచ నదీ సంగమం, ప్రముఖ చారిత్రక , పర్యాటక క్షేత్రమైన పుష్పగిరిలో సోమవారం ఉదయం యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కడప నగరానికి చెందిన మిత్ర యోగా సొసైటీ ఆధ్వర్యంలో ప్రముఖ యోగా థెరపిస్ట్ డాక్టర్ ఆర్ రంగనాథరెడ్డి పర్యవేక్షణలో పలువురు ప్రముఖులు పెన్నా నది ఒడ్డున, పుష్పగిరి కొండపైన గల రుద్రపాద ఆలయం ప్రాంగణంలో యోగా ఆసనాలను వేశారు. ఇందులో భాగంగా ప్రాణాయామం, సూర్య నమస్కారాలను చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రంగనాథరెడ్డి యోగా దినోత్సవ ప్రాముఖ్యత గురించి, జీవితంలో యోగా అవసరం గురించి వివరించారు. 108 శైవ , వైష్ణవ క్షేత్రాల ప్రదేశంగా, పంచ నదీ క్షేత్రంగా, శ్రీ చక్రం గల పవిత్ర ప్రాంతంగా పేరున్న పుష్పగిరి క్షేత్రంలో యోగా దినోత్సవాన్ని జరుపుకోవడం ద్వారా భారత ప్రాచీన సంప్రదాయాన్ని కాపాడుకునే అవకాశం లభించిందని ఇంటాక్ కన్వీనర్ చిన్నపరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం వారు శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి, శ్రీ సంతాన మల్లేశ్వర స్వామి ఆలయాల్లో స్వామి వార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంటాక్ కన్వీనర్ కే చిన్నపరెడ్డి ఆధ్వర్యంలోని లయన్స్ క్లబ్ సభ్యులతో బాటు పోతుల చిన్న ఓబుల్ రెడ్డి, కంచమ్మ స్మారక ట్రస్ట్ అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి, రాయలసీమ టూరిజం కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావసరాలను గుర్తించాలి

వీరపునాయునిపల్లె : ఈ నెల 23వ తేదీ నుంచి జూలై 23వ తేదీ వరకు గ్రామాల్లో పర్యటించి ప్రజావసరాలను గుర్తించే కార్యక్రమం చేపట్టాలని మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సభా భవనంలో జగనన్న సురక్ష పథకంపై సచివాలయ సిబ్బందికి అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, అధికారులు, వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ అధికారి సేవలు ప్రశంసనీయం



లైబ్రేరియన్ కృష్ణకిశోర్‌రెడ్డిని సన్మానిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ లింగాల ఉషారాణి

పులివెందుల టౌన్ : పులివెందుల గ్రంథాలయ అధికారి కృష్ణకిశోర్‌రెడ్డి సేవలు ప్రశంసనీయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ లింగాల ఉషారాణి పేర్కొన్నారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో బదిలీపై వెళ్లిన కృష్ణకిశోర్‌రెడ్డికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి కృష్ణకిశోర్‌రెడ్డిని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ లింగాల ఉషారాణి గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి అమీరుద్దిన్, గ్రంథాలయ ఉద్యోగస్తులతో కలిసి శాలువా కప్పి పూలమాల వేసి మెమెంటో అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా లింగాల ఉషారాణి మాట్లాడుతూ గ్రంథాలయ అభివృద్ధికి కృష్ణకిశోర్‌రెడ్డి ఎంతో కృషి చేశారని.. ఆయన బదిలీపై వెళ్లడం బాధాకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి



ఆర్డీఓకు వినతి పత్రం ఇస్తున్న జర్నలిస్టులు

జమ్మలమడుగు : జమ్మలమడుగు జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలంటూ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆర్డీఓ జి.శ్రీనివాసులకు వినతి పత్రం సమర్పించారు. సోమవారం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నరసింహారెడ్డి నేతృత్వంలో ఉపాధ్యక్షుడు హాజి మహమ్మద్, నాగరాజు, విజయ్ తదితరులు కలిసి సమస్యలను వివరించారు. జమ్మలమడుగు ప్రెస్ క్లబ్‌కు స్థలం కేటాయించడంతోపాటు అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ జర్నలిస్టులకు ప్రెస్‌క్లబ్‌కు కావలసిన స్థలాన్ని కేటాయించడం కోసం తహసీల్దార్‌కు చెప్పడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, మహబూబ్ హుస్సేన్, గంగాధర్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మైఖేల్ సత్యానందరెడ్డి మృతి



మైఖేల్ సత్యానందరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్ విజయమ్మ, (ఇన్‌సెట్) మైఖేల్ సత్యానందరెడ్డి (ఫైల్)

పులివెందుల టౌన్ : పులివెందుల మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ కంటి వైద్య నిపుణులు దివంగత డాక్టర్ ఎస్.పురుషోత్తమరెడ్డి నాల్గవ కుమారుడు మైఖేల్ సత్యానందరెడ్డి ఈ నెల 12న అమెరికాలో గుండెపోటుతో మృతి చెందారు. ఈయన అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తుండేవారు. మైఖేల్ సత్యానందరెడ్డి మృతదేహాన్ని సోమవారం పులివెందులలోని వైఎస్ పురుషోత్తమరెడ్డి కాలనీలో తన నివాసంలోకి తీసుకొచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాతృమూర్తి, పులివెందుల మాజీ ఎమ్మెల్యే వైఎస్ విజయమ్మ, దివంగత వైఎస్ జార్జిరెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మలు మైఖేల్ సత్యానందరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మైఖేల్ సత్యానందరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే పురుషోత్తమరెడ్డి కుమారులు ఎస్.థామస్‌రెడ్డి, ఎస్.సత్యానందరెడ్డి, వైఎస్ కుటుంబ సభ్యులు, వైఎస్ ప్రకాష్‌రెడ్డి, వైఎస్ ప్రతాప్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి సతీమణి వైఎస్ లక్షుమ్మ, దివంగత డాక్టర్ ఇసీ గంగిరెడ్డి సతీమణి ఇసీ సుగుణమ్మ, వైఎస్ ప్రమీలమ్మ, వైఎస్ కమలమ్మలు మైఖేల్ సత్యానందరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సచివాలయాలతోనే గ్రామ స్వరాజ్యం



సచివాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి

పెద్దముడియం : గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య పాలనను సాకారం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన భీమగుండం గ్రామంలో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ రాక ముందు అన్ని గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం మండల, తాలుకా, జిల్లా స్థాయి కార్యాలయాలకు వెళ్లే వారని తెలిపారు. సచివాలయ వ్యవస్థ ఏర్పడిన తరువాత గ్రామాల్లోనే పనులు వేగవంతంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రధానంగా ప్రభుత్వం అందించే నవరత్నాలతోపాటు వివిధ పథకాలకు సంబంధించి సొంతూరులోనే దరఖాస్తు చేసుకొని లబ్ధి పొందుతున్నారని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల ద్వారా టీడీపీ కార్యకర్తలకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందేవని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి వలంటీర్ల వ్యవస్థ ద్వారా పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చవ్వా క్రిష్టారెడ్డి, గ్రామ సర్పంచ్ నాగేశ్వరమ్మ, ఎంపీటీసీ ధనిరెడ్డి సుజాత, రాఘవరెడ్డి, పుల్లయ్య, రామచంద్రారెడ్డి, మోహన్‌రెడ్డి, సంజన్న, సురేంద్రనాథరెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

చేనేత సమస్యల పరిష్కారానికి కృషి



చేనేత సంఘం నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : చేనేత కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకుని సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చేస్తామని ఎమ్మెల్యేడాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో చేనేత సంఘం నాయకులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా చేనేత సంఘ నాయకులు మాట్లాడుతూ చేనేత కార్మికులు తమ వృత్తులకు దూరం అయిపోతున్నారన్నారు. చేసిన పనులకు సరైన గిట్టుబాటు ధరలు లేకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడటంతోపాటు ఆకలితో అలమటించే పరిస్థితి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు వైస్సార్ నేతన్న నేస్తం కింద ఏడాదికి 24 వేల రూపాయలు ఇవ్వడం మంచిగా ఉన్న, చేనేతకు సహకరించే ఇతర వృత్తుల వారికి కూడ వైఎస్సార్ నేతన్న నేస్తం వర్తింపజేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, చేనేత కార్మిక సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయండి



వల్లూరు: సమావేశంలో మాట్లాడుతున్న మండల స్పెషలాఫీసర్ రవీంద్రనాథరెడ్డి

లింగాల : మండలంలో నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల స్పెషలాఫీసర్ మల్లికార్జున పేర్కొన్నారు. జులై 1 నుంచి 22వ తేదీ వరకు మండలంలోని సచివాలయాల్లో కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులకు జగనన్న సురక్ష కార్యక్రమంపై శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్పెషలాఫీసర్ మల్లికార్జున మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన కుల, ఆదాయ, జనన, మరణ, వివాహ, కుటుంబ ధ్రువీకరణ పత్రాలతోపాటు మ్యుటేషన్, వెబ్ నెంబర్‌కు ఆధార్ అనుసంధానం, కౌలు రైతు కార్డులను అక్కడికక్కడే అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సురేంద్రనాథ్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, డీటీ త్రిభువన్ రెడ్డి, ఏఓ రమేష్, మండలస్థాయి అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సన్నద్ధంగా వుండాలి

వల్లూరు : గ్రామ సచివాలయ స్థాయిలోని ప్రతి పౌరుడి సమస్యలను పరిష్కరించి సంక్షేమ పథకాలను అందించి తోడ్పాటునందించే ధ్యేయంతో ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమానికి పూర్తి స్థాయిలో సన్నద్ధంగా వుండాలని సచివాలయ ఉద్యోగులకు మండల స్పెషలాఫీసర్ రవీంద్రనాథరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో సోమవారం మండలంలోని గ్రామ సచివాలయ ఉద్యోగులకు జగనన్న సురక్ష కార్యక్రమంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జుబేద, తహసీల్దార్ శంకర్ రావు, ఈవోపీఆర్డీ ప్రసాద్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించడం హర్షణీయం



కమలాపురం: విద్యార్థులను అభినందిస్తున్న వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి

కమలాపురం : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రోత్సహించడం హర్షణీయం అని మండల వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని ఎర్రగుడిపాడు హైస్కూల్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థులు గత మార్చిలో జరిగిన పరీక్షల్లో నిఖిత (529), లక్ష్మీ మమత (509), చంద్ర నవీన్ (488)లకు ప్రభుత్వం నుంచి వచ్చిన రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి నగదు ప్రోత్సాహక బహుమతులు, మెమెంటో, ప్రశంసా పత్రాలను అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆణిముత్యాలు అనే పథకాన్ని ప్రారంభించి, ప్రతి పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను అభినందిచడం హర్షణీయం అన్నారు. అలాగే తమ ఎర్రగుడిపాడు హైస్కూల్‌లో విద్యార్థులను చేర్పించిన వారికి ఒక్కో విద్యార్థికి రూ.1 వెయ్యి చొప్పున తాను ఇస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యం

వేంపల్లె : విద్యకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం గొప్ప విషయమని వేంపల్లె సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్ నారాయణమ్మ అధ్యక్షతన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన చందన, జి.భాను, ఎస్.సాహితీలకు రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.1000 నగదు బహుమతులను సర్పంచ్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, రవికిరణ్, ఉషారాణి, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కల సాకారం చేసుకోవాలి

చెన్నూరు : విద్యార్థులు తమ కలల సాకారం కోసం నిరంతరం కష్టపడి చదవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మాసీమబాబు, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రామనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వరి, రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఇందులో మొదటి బహుమతిగా కీర్తన రెడ్డికి రూ. 3 వేలు, రెండవ బహుమతి చైతన్యకుమార్‌రెడ్డికి రూ.2 వేలు, మూడో బహుమతి నిఖిల్ సాయికి వెయ్యి రూపాయలు ప్రోత్సాహ బహుమతులుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దీపం స్వప్నిక, ఎంపీటీసీ సుంకర వెంకట సుబ్బమ్మ, పాఠశాల విద్యా కమిటీ వైస్ చైర్మన్ సి.నారాయణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నగదు బహుమతుల ప్రదానం

ఎర్రగుంట్ల : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైనారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్, పాఠశాల హెచ్‌ఎం రామాంజనేయరెడ్డిల ఆధ్వర్యంలో నగదు బహుమతుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. కే యశ్వంత్‌కు రూ.3000, ఎస్ మహమ్మద్ జమీర్‌కు రూ.2000 నగదును అందజేశారు.

స్పోర్ట్స్ స్కూలుకు మండల స్థాయి ఎంపికలు

చెన్నూరు : కడపలోని స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు మండల స్థాయి ఎంపికలు ఈ నెల 21 తేదీ మండలంలోని కొండపేట జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందని ఎంఈఓ స్టెల్లా షర్మిల రాణి తెలిపారు. సోమవారం ఆమె స్థానిక మండల వనరుల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ స్పోర్ట్స్ స్కూల్ కు సంబంధించి నాలుగవ తరగతి, ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. ఈ ఎంపిక సమయం ఉదయం 9:30 గంటలకు ఉంటుందని, తదుపరి జిల్లా స్థాయిలో ఈ నెల 23వ తేదీ నిర్వహిస్తారని ఆమె తెలిపారు.

జమ్మలమడుగు: 2013-24 విద్యాసంవత్సరానికి సంబంధించి క్రీడాపాఠశాల విద్యార్థుల ఎంపిక పట్టణంలోని పతంగే రామన్నరావు ఉన్నతపాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ క్రిష్టఫర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్రీడా పాఠశాలలో 4వ, 5వ తరగతి విద్యార్థుల ఎంపిక కార్యక్రమాన్ని బుధవారం ఉదయం పది గంటలకు జరుగుతుందన్నారు.

చింతకొమ్మదిన్నె : క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపికలు నిర్వహించినట్లు మండల విద్యాధికారి వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని బయనపల్లె శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాలలో ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. మండలంలోని ప్రతి క్రీడాకారుడు జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఎత్తు, బరువు, స్టాండింగ్ బ్రాండ్ జంప్, 800 మీటర్ల పరుగు పందెం తదితర పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దీన దయాళ్, ఉపాధ్యాయులు కృష్ణ ప్రసాద్, రామాంజి. వ్యాయామ ఉపాధ్యాయుడు పవన్, రుద్రరాజు తదితరులు పాల్గొన్నారు.